సాక్షి
ములుగు
గురువారం । 30 । మార్చి । 2023



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. - 10లో▸



వసంతోత్సవానికి వేళాయె

నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, స్ప్రింగ్ స్ప్రీ-23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0⁰ /24.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. పొడి వాతావరణంతో పాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.



ఇఫ్తార్	సహర్
గురు 6:35	శుక్ర 4:49

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పోషకాహారంతోనే ఆరోగ్యం



వెంకటాపురం(కె): పోషకాహారంతోనే చిన్నారులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లను బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ చిడెం యామిలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు చర్యలు



వెంకటాపురం(కె): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర కుష్ఠు వ్యాధి బృందం ప్రతినిధి డీపీఎంఓ వెంకటేశ్వర చారి అన్నారు. మండల పరిధిలోని ఎదిర పీహెచ్‌సీని రాష్ట్ర కుష్ఠువ్యాధి బృందం బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కుష్ఠువ్యాధిపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఏపీఎంఓలు శ్రీనివాస్‌రెడ్డి, జోసఫ్, సురేందర్, జిల్లా అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

'కంటివెలుగు' శిబిరం తనిఖీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం మూడో సబ్ సెంటర్ పరిధిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు అప్తాల్మిక్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. కంటి వెలుగుకు వస్తున్న అంధత్వ సమస్య ఉన్న వారికి చేస్తున్న పరీక్షలు, ఇస్తున్న అద్దాలను పరిశీలించారు. చేస్తున్న పరీక్షలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉంటే రెఫర్ చేయాలని, అద్దాలు కావాల్సిన వారికి తెప్పించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమలత, అప్తాల్మిక్ ఆఫీసర్ రాజన్న, హెల్త్ ఎడ్యుకేటర్ స్వరూపరాణి, ఏఎన్‌ఎం గీత పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అధికారులకు అవగాహన



ములుగు రూరల్: గోవిందరావుపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సీపీఆర్‌పై మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఓ నాగ పద్మజా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి అకస్మాతుగా కిందపడితే సీపీఆర్ చేయాలన్నారు. గుండెపోటుతో పడిపోయిన వారికి 2 నుంచి 8 సార్లు బ్రీత్ ఇవ్వాలన్నారు. సీపీఆర్‌పై అధికారులు ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అల్లం రాజకుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారులు సుకుమార్, మధు, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, ఉత్పాదకతే లక్ష్యం!



పశుదాన యూనిట్, గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

- యూనిట్ విలువ రూ.10లక్షల నుంచి కోటి వరకు సబ్సిడీ రుణాలు
- పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పథకం అమలు





ములుగు రూరల్: ఉపాధి, ఉత్పాదకతే లక్ష్యంగా పశుదాన యూనిట్, జీవాల పెంపకందారులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో సబ్సిడీ రుణాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పేరుతో పెంపకందారులు 50 శాతం సబ్సిడీ అందించి జీవాల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తుంది. ఎస్‌ఎల్‌ఎం పథకం ద్వారా గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకానికి రుణాలను మంజూరు చేస్తోంది. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షల నుంచి కోటి వరకు అందిస్తోంది. ఇందులో అన్ని సామాజిక వర్గాల ప్రజలను అర్హులుగా గుర్తించింది. దీంతో పాటు పరపతి సంఘాలు, సొసైటీలకు రుణాలను మంజూరు చేస్తోంది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పథకం అమలుకు శ్రీకారం చేపట్టింది.

సబ్సిడీ 50 శాతం

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం మార్పు చేపట్టింది. పథకం ప్రారంభంలో కేవలం యూనిట్ విలువ రూ. కోటి కేటాయించింది. బ్యాంకు రుణం రూ.40 లక్షలు, లబ్ధిదారుడి వాటాధనం 10 లక్షలు, ప్రభుత్వ సబ్సిడీ రూ.50 లక్షలుగా నిర్ణయించింది. యూనిట్ విలువలో బ్యాంకు రుణాలను బ్యాంకర్లు నిరాకరించడంతో యూనిట్ విలువను తగ్గించింది. దీంతో యూనిట్ విలువను ఐదు విభాగాలుగా విభజించి రుణాలు అందజేయాలని సడలించింది. దీంతో యూనిట్‌లో 105 నుంచి 525 గొర్రెల వరకు కొనుగోలు చేసేందుకు రూ.10 లక్షల నుంచి కోటి వరకు రుణాలు ఇస్తోంది.

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విధానం

లబ్ధిదారుడు ఎంపిక చేసుకున్న యూనిట్‌ను బట్టి 2 ఎకరాల భూమి నుంచి 10 ఎకరాల భూమి అవసరం ఉంటుంది. భూమి లేని లబ్ధిదారులు లీజ్‌కు తీసుకొని రుణాలు పొందవచ్చు. లబ్ధిదారుడు యూనిట్ పెంచుకునే స్థలంలో పశుగ్రాసం పెంచి బ్యాంక్ కాన్సెంట్ తీసుకు రావాలి. లబ్ధిదారుడు ఒరిజినల్ డాక్యుమెంట్లు జత చేస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కాపీలను జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చివరి తేదీ లేకుండా లబ్ధిదారుడు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

ఎంపిక విధానం

ఎస్‌ఎల్‌ఎం పథకంలో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారి ఎంపిక కోసం రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుడికి బ్యాంకు రుణం మంజూరైన తరువాత 25 శాతం, యూనిట్ గ్రౌండింగ్ అయిన తరువాత 25 శాతం సబ్సిడీ నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. బ్యాంకు రుణం అవసరం లేని వారు సొంతంగా పెట్టుబడి పెట్టి షెడ్‌లు, పశుగ్రాసం పెంపకం చేపట్టిన అనంతరం సబ్సిడీని పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. జిల్లాలో 13 మంది దరఖాస్తులు చేసుకోగా ఒక్క యూనిట్ మాత్రమే మంజూరు అయింది. మిగతావి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరణ కారణాలను లబ్ధిదారులకు తెలియజేశాం.

- విజయ్ భాస్కర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

పకడ్బందీగా 'పది' పరీక్షలు నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ములుగు: ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగబోయే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం పదో తరగతి పరీక్షలపై మంత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్‌ఎంలు ఉండాలని తదితర విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో 115 ఉన్నత పాఠశాలలకు సంబంధించి 21 పరీక్షా కేంద్రాల్లో సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 21 చీఫ్ సూపరింటెండెంట్లు, 22 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారని వెల్లడించారు. 3,170 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ వివరించారు. అదే విధంగా ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్, డీఈఓ పాణిని, అడిషనల్ ఎస్పీ సదానందం, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారి కె. అశోక్, విద్యుత్ శాఖ డీఈఈ నాగేశ్వర రావు, ఆర్టీసీ అధికారి జ్యోత్స్న, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీపీఆర్‌ఓ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న డివిజనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి

ములుగు రూరల్: అటవీ ఉత్పత్తుల కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు తోడ్పాటును అందించాలని జీసీసీ డివిజనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇంచర్లలో బుధవారం నిర్వహించిన గిరిజన ప్రాథమిక సహకార సంఘం 9వ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా జీసీసీ ములుగు బ్రాంచ్ చేపట్టిన కార్యక్రమాలు, ఆదాయ వివరాలను తెలుసుకుని మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ మండలంలో జీసీసీ పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు తహసీల్దార్లు స్థల సేకరణ చేస్తున్నారన్నారు. జాకారం లోని పెట్రోల్ బంక్ పనులు ఏప్రిల్ చివరి వారం వరకు పూర్తి చేస్తామన్నారు. గిరిజనులు అటవీ ఉత్పత్తుల్లో విప్ప పువ్వు, విప్ప గింజల సేకరణ చేపట్టాలన్నారు. దీంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో విప్పనూనె కర్మాగారం ఏర్పాటుకు వీలుంటుందని వివరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సొసైటీ డైరెక్టర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ శ్రీనివాస్, యాకయ్య, పుల్లయ్య, వరలక్ష్మి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ములుగు రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. మండల పరిధిలోని బండారుపల్లిలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షలు 147 మందికి చేసి 30మందికి రీడింగ్ గ్లాసులు, ప్రిస్కిప్షన్ గ్లాసెస్ 20 మందికి రెఫర్ చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రణాళికతో కంటి పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ అమూల్య, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కల రఘోత్తం, అష్టమాలిక పూర్ణచందర్, డీఈఓ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'ప్రధానిని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు'



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విమర్శించే అర్హత మంత్రి కేటీఆర్‌కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. దేశం కోసం అనునిత్యం పని చేస్తున్న ప్రధానిని విమర్శించే ముందు కేటీఆర్ స్థాయి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర పాలన గాలికి వదిలి సీఎం కేసీఆర్ ఫాం హౌజ్‌కు పరిమితమయ్యాడని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన అవినీతి, అక్రమాలలో కేసీఆర్ కుటుంబానికి ప్రత్యక్ష సంబంధాలున్నాయని వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, తాటి కృష్ణ, భూక్య రాజు నాయక్, భూక్య జవహర్‌లాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు నైపుణ్య పరీక్షలు



యువతకు నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా అధికారి పిల్లి శ్రీపతి

ములుగు రూరల్(గోవిందరావుపేట): గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటుకు బుధవారం యువతకు నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. గోవిందరావుపేట మండల పరిధిలోని కర్లపల్లిలో యువతకు వల విసరడం, వల అల్లికలు, ఈతపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి మాట్లాడారు. కర్లపల్లిలో నిర్వహించిన నైపుణ్య పరీక్షల్లో ప్రతి ఒక్కరూ అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, ఐటీడీఏ జిల్లా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, సర్పంచ్ ఈక అంజిబాబు, జీసీసీ డైరెక్టర్ పురుషోత్తం, పీసీ రీజనల్ కోఆర్డినేటర్ సాయిబాబు, సొసైటీ అధ్యక్షుడు నరేందర్, పీసీ మొబిలైజర్ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు విస్మరించిన కేంద్రం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను విస్మరిస్తుందని, దేశంలో నిరంకుశ పాలన కొనసాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో బయ్యారం నుంచి ప్రారంభమైన పోరుయాత్ర బుధవారం మల్లంపల్లికి చేరుకుంది. తొలుత జిల్లా కేంద్రంలో రోడ్డు షో నిర్వహించారు. అనంతరం జంగాలపల్లిలో ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కమలాపూర్ బిల్ట్ ఫ్యాక్టరీని ప్రారంభించకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి తొమ్మిది సంవత్సరాలు గడిచిన అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో స్విస్ బ్యాంకుల నుంచి నల్లధనం వెలికితీసి ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తానని మాట తప్పారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ కార్మికుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సభ్యులను సైతం అనర్హులుగా ప్రకటించడం మోదీ నియంతపాలనకు నిదర్శనమన్నారు. విభజన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన పోడు భూములకు పట్టాలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, దళితులకు మూడెకరాల భూ పంపిణీ చేపట్టాలన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీల కారణంగా నిజాయతీగా పరీక్షలు రాసిన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు, భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శులు తోట మల్లికార్జున్, రాజ్ కుమార్, భిక్షపతి, రవి, విజయసారథి, రాజారెడ్డి, రాష్ట్ర నాయకులు పంజాల రమేష్, జ్యోతి, సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, ముత్యాల రాజు, నర్సయ్య, కొమురయ్య, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ కృష్ణ ఆదిత్య



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఐడీఓఎస్ నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని, ఏప్రిల్ నెలాఖరు వరకు సీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి స్లాబ్ పూర్తి చేయాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐడీఓఎస్) నిర్మాణ పనులను కలెక్టర్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ లెవెల్‌లో జరుగుతున్న ఏ, బీ, సీ బ్లాక్‌ల్లో పుట్టింగ్, డబుల్ పుట్టింగ్ నాణ్యత లోపించకుండా వేసి ఏప్రిల్ నెలాఖరుకు సీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి స్లాబ్ పూర్తి చేయాలన్నారు. వేసవికాలంలోనే మిగతా ఏ, బీ బ్లాక్‌ల గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంగా కాకుండా, అత్యాధునిక హంగులతో కూడిన అద్భుతమైన కార్పొరేట్ ఆఫీస్ గా ఐడీఓసీని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జరుగుతున్న వాచ్‌మెన్ రూం నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. వాచ్‌మెన్ రూంను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. గెస్ట్‌హౌస్‌లోకి ఇతరులకు అనుమతి లేకుండా చూడాలన్నారు. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ప్రాంగణంలో ఇంకుడు గుంతను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ముందు ఖాళీ స్థలంలో మంచి మొక్కలను నాటాలన్నారు. ఖాళీ స్థలంలో సేద తీరేందుకు సిమెంటు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు పార్కింగ్‌కు స్థలాన్ని చదును చేయాలన్నారు. కలెక్టర్ వెంట ములుగు తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఇంజనీర్ విష్ణు, ములుగు ఆర్‌ఐ విజేందర్, సర్వేయర్ సత్యనారాయణ ఉన్నారు.

సిరికొండ ప్రత్యేక పూజలు



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండ స్వగ్రామమైన పరకాల మండలంలోని నర్సక్కపల్లి నుంచి కోటంచ ఆలయానికి ర్యాలీగా వచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిక కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీఇచ్చారు.అనంతరం ఆయనను నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కత్తి సంపత్, వావిలాల రమేష్, గునిగంటి మహేందర్, తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు ఆహారాన్ని అందజేస్తున్న అధికారులు

మంగపేట: చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల తల్లి, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత అన్నారు. మండల పరిధిలోని రమణక్కపేటలో ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో ఏటూరునాగారం సీడీపీఓ హేమలత ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన అన్ని రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రత్యేకతను వివరించారు. చిరుధాన్యాల ఆహారంలో కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలు ఉన్నాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఎస్‌పీఎంయూ కో ఆర్డినేటర్ రాహుల్ సాధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఎంపీడీఓ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పోషణ్ అభియాన్ సిబ్బంది ఇమాన్యుయేల్, బ్లాక్ కో ఆర్డినేటర్ విజేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి

ములుగు రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలని డీడబ్ల్యూఓ ప్రేమలత అన్నారు. మండల పరిధిలోని బండారుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న భాగ్యలక్ష్మి

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ అధికారిణి, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి భాగ్యలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. పౌష్టికాహార పదార్థాలతో పాటుగా వంటకాలను రుచికరంగా వండాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పిల్లలతో కలిసి భోజనం చేశారు. భోజనం చాలా బాగుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనగాం బాబురావును అభినందించారు. పాఠశాల ఆవరణతో పాటుగా భోజనం కూడా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ చీకుర్తి రమేష్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఫిరోజ్, సాంబయ్య, కిరణ్ కుమార్, శ్రీనివాసులు, మహేష్, జ్యోత్స్న, రికార్డు అసిస్టెంట్ సత్యం, సీఆర్పీ కుమార్ పాడ్య పాల్గొన్నారు.



సైన్స్‌తోనే వ్యక్తిత్వ వికాసం


నోటి ద్వారా మంటలు తెప్పిస్తున్న నరేష్

మహదేవపూర్: సైన్స్‌తోనే వ్యక్తిత్వ వికాసం అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. మహిమలు బూటకం– సైన్స్ నిజం అనే అంశంపై మండల పరిధిలో బొమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని అన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమని తెలిపారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం, లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్, క్యాంపు కోఆర్డినేటర్ పరశరాములు, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

- కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లేయత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్, కేసు నమోదు


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు


పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జేఏసీ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లి పోతామని విద్యార్థి జేఏసీ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలన భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు.


పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీలో తిష్ట వేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కల్లెపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, బి నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపు నిస్తున్నట్లు ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్టును నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.

ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

–తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జాక్ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

–మేడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: ఏపీ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ జిల్లాలో అమ్మకాలు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి. సీతారాం తెలిపారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై ఎస్‌కె జానీపాషాతో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన కూకట్ల నిశాంత్, గోవిందరాజుల గుట్టకు చెందిన బొల్లి లక్ష్మణ్, భూపాలపల్లికి చెందిన మహ్మద్ అజహర్, తొగరి నిఖిల్, తొర్రూరు మండలం మడిపల్లికి చెందిన సిరబోయిన కృష్ణ, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన చీకటి కిరణ్‌లు కలిసి రెండు రాష్ట్రాల మీదుగా వరంగల్, జనగామ ప్రాంతాలకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌తో కలిసి నిశాంత్ గంజాయి అమ్మకాలు చేసే వారు. ఇటీవల జలీల్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లడంతో బుల్లి లక్ష్మణ్, అజహర్‌తో కలిసి నిశాంత్ సులభతరంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గంజాయి సప్లయ్ చేస్తున్నారు. నెల్లికుదురుకు చెందిన కృష్ణమూర్తి, కిరణ్‌పై వరంగల్, మహబూబాబాద్, ఖమ్మంలో గంజాయి కేసులు నమోదు కావడంతో పోలీసుల కళ్లు కప్పి వారి మకాం జనగామకు మార్చుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు నర్మెట మండల కేంద్రం హెచ్‌పీ, ఏసర్ పెట్రోలు బంకులు, దుర్గమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వేర్వేరుగా తనిఖీలు చేపట్టగా వాహనాలపై వెళ్తున్న ఆరుగురు వ్యక్తులపై అనుమానం వచ్చి తనిఖీలు చేయగా వీరి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న సీఐ నాగబాబు, ఎస్సై జానీపాషా, హెడ్ కానిస్టేబుల్ గట్టయ్య, కానిస్టేబుళ్లు ధనుంజయ్, ప్రవీణ్, రహమత్‌అలీ, హమీద్, రాజు, రమేష్, గాలిబ్‌లను డీసీపీ అభినందించారు.

వసంతోత్సవానికి వేళాయె

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ–23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్


కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతి సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్ స్ప్రీ–23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను, మన సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకుని మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ–23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మితియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్‌నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్ నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రొ షోలు, స్పాట్ లైట్స్, స్యాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజేస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్‌ఫుల్‌గా సాగనుంది.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

తెల్లారిన బతుకులు

- కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన కారు
- ఇద్దరు కూలీలు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరకాల చలివాగు వద్ద ఘటన


కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన కూలీలు


చేరాలు మృతదేహం


దుబాసి కోమల (ఫైల్)

పరకాల: కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ఇద్దరు కూలీలను పొట్టనపెట్టుకోగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని చలివాగు వంతెన శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు అదే గ్రామానికి చెందిన మద్దెబోయిన సందీప్‌కు చెందిన ఆటోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు మిర్చి తోట ఏరటానికి బుధవారం తెల్లవారుజామున బయలుదేరారు. పరకాల చలివాగు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన కారు ఆటో కుడివైపు ఢీకొని ముళ్లపొదళ్లలో పడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలంతా ఎగిరిపడి తీవ్ర గాయాలయ్యాయి. కుడివైపు కూర్చున్న కొంగరి చేరాలు(57), దుబాసి కొమల (56)కు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరు సిలువేరు కొంరమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తీవ్రగాయాలైన పసుల భిక్షపతి, దుబాసి సూరమ్మ, కొంగరి లక్ష్మీ, సాలికి స్వరూపలు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల మానవత్వం

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలైన సమాచారం తెలియగానే పరకాల సీఐ పుల్యాల కిషన్, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న కూలీలను ఎత్తుకొని 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రలోని సిరొంచ మండలం ఆసరవెల్లి గ్రామానికి చెందిన గుండు తేజపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత


వాంతులు చేసుకుంటున్న కూలీలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావకాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు.